# దేవుడి గుడి

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

దేవాలయంలో దేవుడు వెయ్యి దీపాల ముందు దేదీప్యమానంగా వెలిగి పోతున్నాడు. దేవాలయ ప్రాంగణంలో జనం కిటకిటలాడిపోతున్నారు. క్షణక్షణానికి ఖంగు ఖంగుమని పెద్ద శబ్దంతో మోగే గంటలు చెవుల్ని చిల్లులుపడేట్లు చేస్తున్నాయి. పూజారి చదివే మంత్రాలు జన సందోహంలో కలిసిపోయి బయటకి అదో తమాషాగా, వింతగా వినబడుతున్నాయి. ఆదారినే, ఆ సాయంత్రం కనుచీకటి పడే సమయాన పోతున్న నేను వాటిలో పగలబడి, విరగబడి నవ్వుతున్నాను.

ఏ దేవుడో చెప్పను. చెప్పలేను. యిష్టం లేదు కాబట్టి. శుద్ధ నాస్తికుణ్ణి.

* * *

"విన్నావుగా" అన్నాడు శాస్త్రి ఆ రోజు ఉదయం మా యింటికి వచ్చి.

"విన్నావా?" అని అడిగితే అది ప్రశ్నార్థకం. "వినలేదూ?" అంటే పరిహాసం. అదేదీ లేకుండా "విన్నావుగా" అనేమాటలో నేను వినేవుంటాననీ, ఒక వేళ ఏ కారణం చేతనైనా వినకుండావుంటే విని తీరాలనీ వాని మాటలో అంత స్పష్టంగా కాకపోయినా అస్పష్టంగానైనా కనబడుతూనే వుంది.

"వినలేదు" అన్నాను.

"ఏమిటది?"

"ఏమిటో తెలిస్తే విన్నాననే చెప్పివుండే వాణ్ణిగా."

నాకో విషయం తెలుసు. శాస్త్రి అంత పొద్దున్నే వచ్చి అంత ఆతృతపడి అడుగుతూంటే అదేదో పెద్ద విశేషమైన విషయమే అయి వుంటుందని.

శాస్త్రి వచ్చిన సమయాన నేను మొహం కడుక్కుంటున్నాను. ఆ వినేదేదో కాఫీ త్రాగే విందామని ఉండమని చెప్పి లోపలకు వెళ్ళాను. మరో నిమిషానికే ఆవిడ యిచ్చిన రెండు గ్లాసుల కాఫీ రెండు చేతుల్లోనూ తెచ్చి వస్తుంటున్నా ఒకటి శాస్త్రికిచ్చి, యింకోటి నేను నోటిదగ్గర పెట్టుకున్నాను.

"ఇప్పుడు చెప్పు"

"సదానంద స్వాములవారు తెలుసా?"

శాస్త్రి ప్రారంభించాడు. నేను కూడా వినటం మొదలెట్టాను. కాని అదేమిటో ఆయన పేరు వింటే నాకు నవ్వు వస్తుంది. సదానందస్వామివారు అని పిలువబడ్డ ఆయన్ని నేను అప్పుడప్పుడూ ఏ శాస్త్రో పోయినప్పుడు ఊరి బయట వున్న మఠంలో చూస్తూనే వుంటాను. కాని అదేమిటో ఆయన ఎప్పుడు చూసినా సదానందంగా కాక విచారగ్రస్తమైన ముఖంతో సాక్షాత్కరిస్తూ వుంటారు.

"ఉన్నారు" అని బదులు చెప్పాను.

"ఇక తగ్గు. పరిహాసాలు మొదలు పెట్టబోకప్పుడే. ఆయనకు రాత్రి కల వచ్చిందట."

"నిజంగా?"

శాస్త్రికీ, నాకూ యిటువంటి విషయాల్లో అసలు పడదు.

"లేక అబద్ధమనుకుంటున్నావా?" అన్నాడు కోపంగా శాస్త్రి. తరువాత ఒక గుక్క కాఫీ త్రాగి "చెప్పేది పూర్తిగా విను. కల ఏమనో తెలుసా? దేవుడు సాక్షాత్కరించి, ఫలానా రంగయ్యగారి స్థలంలో విలిశాను. రేపే యీ విషయం పూర్తిగా చెప్పి గుడి కట్టటానికి అనువుగా డబ్బు సంపాయించే ఏర్పాటు చేసి, త్వరలోనే నా గుడి యేర్పాటయ్యే విధానాన్ని చూడమని సెలవిచ్చాడట" అని చెప్పేశాడు చాలా సూక్ష్మంలో.

శాస్త్రి అంత తేలిగ్గా చెప్పేసినందుకు నేను చాలావరకూ సంతోషించాను. కాని వాడింతలోనే పిడుగు పడ్డట్టుగా "అరే. నీకసలు ఏ దేవుడో చెప్పనే లేదే" అంటూ మొదలెట్ట బోయాడు.

"వద్దు. చెప్పవద్దులే" అనేశాను నేను.

వాడు వూగుతున్నాడు. ఈ వూపులోనే టంలో కాఫీ త్రాగటం ముగించి సదానంద స్వామివారి గొప్పతనాన్ని గూర్చి వర్ణించటం వచ్చాడు. ఆయన చాలా గొప్పవాడట. ఈ వూళ్ళు వచ్చి.... కాదు యీ వూరికి విచ్చేసి వెలరోజులే అయినా ఆయన ప్రతిభ యీ వూళ్ళోనే కాదు, చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా పాకిపోయిందట. ఎంతమంది కోర్కెలు తీర్చి భగవంతుని దయ వాళ్ళమీద ప్రసారమయేట్లు చేశాడో లెక్కే లేదట.

ఇంతా చెప్పి అటువంటి వారికి యిటువంటి కల రావటం ఒక గొప్ప విషయం కాదని తేల్చాడు శాస్త్రి. అంతటితో వూరుకుంటేనా? నన్ను కూడా నమ్మమంటాడు.

నా సిద్ధాంతాలు తెలిసి కూడా యిలా ఎందుకంటాడో, యిప్పుడు ఒక్కసారే కాదు, చాలాసార్లు—నా కర్థం కాదు.

"నా నమ్మకం విషయం నీ కెందుగ్గానీ ఆ కల పర్యవసానం చెప్పు" అన్నాను.

"ఏముంది? ఈ రోజు తెల్లవారుఝామున ఆయన రంగయ్యగార్నీ, యింకొంత మంది పెద్దమనుషుల్నీ వెంటబెట్టుకుపోయి, కల్లో దేవుడు చెప్పిన గుర్తుల ప్రకారం త్రవ్వించాడట. త్రవ్విస్తే కనిపించింది."

"ఏమిటి?"

"ఇంకేం కనిపిస్తుంది నీ మొహం, విగ్రహం. దేవుడి విగ్రహం. ఏ దేవుడంటే...."

"వద్దు. వద్దులే" అని ఆపాను అలవాటు ప్రకారం.

"సరే. యింతకీ ఏమంటావు?" అని ఒక నిమిషం ఊరకుని. శాస్త్రి నా వంక ఎగాదిగా చూశాడు. వానిలో వాడు నవ్వుకున్నాడు. ఆశ్చర్యపడ్డాడు.

"ఇంతా విని యిదా నీ ప్రశ్న. యిప్పటికైనా నీ నాస్తికత్వం మానుకొమ్మని చెబుతున్నాను. దేవుడున్నాడని నమ్మమంటున్నాను. దేవుడు లేందే యిటువంటివి ఎట్లా జరుగుతున్నాయని అడుగుతున్నాను" అంటూ చాలా ఘాటుగానే అడిగాడు.

ఇటువంటి ప్రశ్నలు వినటం ఒక్క శాస్త్రి నుంచే కాదు. ఎంత కాలంనుంచో ఎంతమంది నుంచో విన్నాను. అందుకని నేను విన్నా విననట్లే లెక్క.

"సరే. అయితే అక్కడికి వస్తావురా మూర్తీ" అని అడిగాడు చివరకు.

"నేను రాను" అని చెప్పాను.

"ఎం చేత?"

"మళ్ళీ త్రొత్తా? ఇటువంటివి యిష్టంలేదు కనుక."

శాస్త్రి అదో విధంగా ముఖంపెట్టి "సరే అయితే నీ యిష్టం. కాని ఎందుకు చెప్పానో కొంచెం ఆలోచించుకో. వెళ్తున్నాను" అంటూ లేచి — పోబోయాడు. నాకు ఒక ఆలోచన తట్టింది. "అయితే ఆగు వస్తున్నాను" అని చెప్పి లోపలకు పోయి బట్టలు మార్చుకు వచ్చాను. ఇద్దరం బయలుదేరాం.



"నీ నాలుక తెగిపోదూ?" అన్నారు రంగయ్యగారు

"ఆ రంగయ్య ఏమంటున్నాడు?" అని అడిగాను జాగ్తో.

"ఏమంటాడు? పిల్లిలా అయిపోయాడు. గుడి కట్టుకునేందుకు తన స్థలాన్ని ఊరికే నే ఇచ్చేస్తానని చెప్పాడు."

ఆశ్చర్యపోయాను. రంగయ్య ఎటువంటి మనిషో నాకు తెలుసు. అటువంటి వానిని ఇట్లా ఒక్క క్షణంలో మార్చగలిగినందుకు నిజంగా ఆ స్వామివార్ని మనసులో అభినందించాను.

అక్కడికి చేరుకున్నాం. ఓహ్. జనం. తండోపతండాలు. అప్పుడే ఊరంతా ఎలా వ్యాపించిపోయింది? "నేనేనా ఆలస్యంగా వచ్చింది" అనుకున్నాను.

అంతమంది జనాన్ని తోసుకుని లోపలికి పోయేందుకు మొదట సాధ్యపడలేదు. శాస్త్రి, నేనూ కలిసి ఎట్లా అయితేనేం చివరికి వెలిసిన దేవుని దగ్గరకు చేరుకున్నాం.

అంతమంది జనానికి ముందుగా నిల్చున్నది సదానందస్వామి, ఆ తర్వాత రంగయ్యగారు.

చూశాను. దేవుడే. ఏ దేవుడో చెప్పలేను. కాని ఎలా వెలిశాడు. ఎక్కడో ఆకాశం నుంచి ఊడిపడి వచ్చి యిక్కడ యిలా పాతుకుపోయాడంటే ఎలా నమ్మను? అసలు దేవుడే లేడనే మతమైతే నాది.

"చూశావా?" అన్నాడు శాస్త్రి.

"చూశాను."

"ఏం చూశావు?"

"అమాయక ప్రజలు. వీళ్ళ అమాయకత్వాన్ని, మూర్ఖత్వాన్ని చూస్తుంటే నాకు జాలికి బదులు కోపమే కలుగుతున్నది." శాస్త్రి ప్రశ్నతో నా కడుపు మండిపోయింది.

"ఏం చూశాను? బూటకపు సన్యాసులు దేవుని పేరుతో, భక్తి పేరుతో ఎంతమంది ప్రజలను మోసగిస్తున్నారో చూశాను. ఇంటి ముందు నిలబడి దీనంగా అడుక్కునే బిచ్చగానికి పిడికెడు బిచ్చం యివ్వటానికి నిరాకరించే షావుకార్లు అర్థంలేని యీ దేవుని మహిమను ఎలా జోహారు చేస్తున్నారో చూశాను" అన్నాను గట్టిగా. ధైర్యంగా. శాస్త్రిగాడు నా నోరు మూయడానికి ప్రయత్నించాడు. కాని అప్పటికే వినబడవలసిన యిద్దరికీ యీ మాటలు వినబడ్డాయి. చుట్టూరా నిల్చుని దేవుని మహిమను గురించి, సదానందస్వామి మహాత్మ్యాన్ని గురించి చిలవలు పలవలుగా చెప్పుకుంటున్నవాళ్ళు కూడా నా వంక విస్మయంగా చూశారు.

రంగయ్యగారు నా వంక కళ్ళెర్రజేసి చూశారు. సదానందస్వామి కళ్ళలో అగ్నిజ్వాలలు లేచాయి.

"దేవున్ని గురించే యింత మాటా? వచ్చే జన్మలో నీకేమైనా పుట్టగతులుంటాయా? నీ నాలుక తెగిపోదూ?" అన్నారు రంగయ్యగారు నిప్పులు గ్రక్కుతూ.

స్వామి మాత్రం "పాపం శమించుగాక" అన్నాడు పరమ శాంత స్వరంతో.

నేనేం భయపడలేదు. "ఇటువంటి కల్లబొల్లి వచనాలను విని యిక్కడెవరూ మోస

పోరు. మాటా, మర్యాదయంలేని యీ రాతి బొమ్మ యీ భూమిలోకి ఎలా వచ్చిపడింది. ఇక్కడ ప్రతిష్ఠ గావటం మీ కెవరైనా చూశారా?" అన్నా నింకా గట్టిగా.

"అయితే యిక్కడికి ఎలా వచ్చిందంటావు?" అని అడిగారు రంగయ్యగారు నన్ను.

"దేవుళ్ళు సరిగా సృష్టిచేసరి. చీకట్లో ఎంత పనయినా చెయ్యవచ్చు."

రంగయ్యగారి కళ్ళు క్రోధంతో మండి పోతుంటే చూశాను. నాకో క్షణం వుంటే ఆయన బలమైన చెయ్యిక్రింద నా చెంప ఛిద్ర మని వుండేది. కాని సదానందస్వామి అడ్డుపడి "భగవంతుడు యీ కుర్రవానిని రక్షించుగాక. ఇక ముందయినా యితని అమాయకత్వం నశించుగాక" అన్నాడు.

"నే నేం కుర్రవాణ్ని కాదు. నాకు యిరవై మూడేళ్ళు" అందామనుకున్నాను. కాని ఏం మాట్లాడతాను. ఒకటి కాదు, రెండు కాదు, కొన్ని వందల చేతులు నన్ను కొట్టేందుకు సిద్ధంగా వున్నాయి. కొన్ని వందల కళ్లు నన్ను భస్మం చేసేట్లు చూస్తున్నాయి. శాస్త్రి కలగజేసుకుని నా రెక్క పుచ్చుకొని బలవంతా బయటికి యీడ్చుకొచ్చాడు.

నే నేదో చెప్పబోయాను.

"ఛా ఛా. ఇం కాసేపుంటే ఏమయ్యేది? అయినా నీ కెందుకంత తొందర?" అన్నాడు శాస్త్రి.


వెనకాలనుంచి తిట్లూ, నవ్వులూ వినిపిస్తూనే వున్నాయి.

"నిజంగా నాది తప్పేరా శాస్త్రీ" అన్నాను కొంతదూరం పోయాక.

శాస్త్రి నా వంక సంతోషంగా చూస్తూ "అయితే నీ సిద్ధాంతాలు మార్చుకున్నావా?" అన్నాడు.

అహా. అది ఎప్పటికీ జరగదు. కాని తప్పని ఎందుకన్నానంటే నిజాన్ని వాదించకుండా ఆ స్థితిలో అవమానకరంగా మాట్లాడటం మొదటి తప్పు. పిలవని పేరంటంగా వెళ్ళి వాళ్ళను ఆక్షేపించటం రెండవ తప్పు. ప్రపంచంలో అనేక రకాల మనుష్యు లుంటారు. ఎవరి సిద్ధాంతాలు వాళ్ళ కుంటాయి. వాళ్ళ నమ్మకాల ప్రకారం వాళ్ళు నడుచుకొంటారు. అందరికీ అనువైన పరిస్థితులో తప్ప, అందరికీ యిష్టమైతే తప్ప ఎవరి ఉద్దేశాలు వాళ్ళు బయట పెట్టకూడదు. అదే యిప్పుడు అవగాహనా రూపంగా తెలుసుకున్నాను" అన్నాను.

నడుస్తున్న శాస్త్రి "ఆ మాత్రమైనా తెలుసుకున్నావు కదా. మేలు" అన్నాడు.



వర్ధమాన మహావీరుడు

ఫోటో: శ్రీ బి. రవీంద్రనాథ్

కాని నేను మనసులో సదానందస్వామిని ఏమాత్రం నమ్మలేదు. దేవుడు వెలవటాన్ని గురించి అంటున్నా నమ్మలేదు. తప్పకుండా ఏదైనా గొడవలు జరుగుతా యనుకున్నాను. ఏం జరిగినా చూద్దా మనుకున్నాను.

తర్వాత యింటికి వచ్చేశాము.

ఆ తర్వాత వారం రోజులకు యింకోసారి శాస్త్రి కనిపించాడు. "ఏమిట్రా సంగతులు?" అని అడిగాను.

"ఏమున్నాయి. బొత్తిగా తీరటం లేదు" అన్నాడు.

"అంత తీరని పనేమిటి?"

"దేవాలయ నిర్మాణానికి డబ్బు వసూలు చేస్తున్నాము. దాంతో ప్రక్క గ్రామాలకు కూడా గాలింపబడల్సి తిరగవలసి వస్తుంది" అన్నాడు.

"ఏమాత్రం వసూలయిం దేమిటి యిప్పుడు?"

"ఏదీ? ఇప్పటికి ఓ అయిదు వేలయింది. ఇంకా యింతకు యిబ్బడి రావాలి. ఎలానో?" అన్నాడు శాస్త్రి.

నాకో సందేహం వచ్చింది. "ఎందుకన్నా మంచిది. ఆ వచ్చిన డబ్బు మట్టుకు స్వామి చేతుల్లో పోయకండి" అన్నాను.

"ఏం?"

"అంతే. మిగిలింది నే చెప్పను" అన్నా మిగిలింది వానిని ఊహించుకోమన్నట్లు.

"నీ మోహం. యింతవరకూ వచ్చింది ఆయనకే యిచ్చాము. ఇక ముందు కూడా అలానే యిస్తాం. అర్థంలేని అనుమానాలూ నువ్వూనూ. సరే మళ్ళీ పోవాలి వస్తా."

శాస్త్రి వెళ్ళిపోయాడు. నా అనుమానం నా కుంది.

## మాతృత్వం

★

"బేబీ కార్ల నిర్మాణంలో ఇంగ్లండు ప్రపంచానికంతటికీ ప్రథమ స్థానం సంపాదించింది" అని వ్రాయబడివున్నది.

"బాగుంది! ఇంగ్లండు మాతృదేశం అన్నమాట" అన్నాడొకడది చూసి.

రోజులు మెల్లగా గడుస్తున్నాయి. శాస్త్రి గారికి హడావుడి వున్నకొద్దీ ఎక్కువవుతూనే వచ్చింది. హీనిలాగైతే యింకో సగముంది రాత్రింబవళ్లు కష్టపడితే యింకో అయిదు వేలు వసూలయింది. అది చాలదు. యింకా కావాలి.

రంగయ్య స్థలమంటే యిచ్చాడు గాని ఈ డబ్బు యివ్వలేదు. పైగా "ఇది చాలదా? ఈ స్థలం అమ్మితే ఎంత డబ్బు వస్తుందో తెలుసా? ఏ ఆసామి అంత డబ్బు యిచ్చాడు?" అంటాడట.

నాకు ఆ సదానందస్వామంటే మొదట్నుంచీ నమ్మకం లేదు. డబ్బుకోసమే యీ నాటకమంతా ఆడిస్తున్నాడని నా విశ్వాసం. శాస్త్రివాళ్ళు అనవసరంగా కష్టపడుతున్నారే అని విచారించేవాణ్ణి. ఏదో ఒక రోజు యీ స్వామే ఏదో అఘాయిత్యం చేస్తాడని నేను గట్టిగా నమ్మాను.

చివరికి ఒక రోజు నేననుకున్నంతా అయింది. శాస్త్రిగాడు ఒక రోజు ఉదయాన్నే చెమటలు గ్రక్కుకుంటూ పరుగెత్తుకు వచ్చాడు. వాడి నోటినుంచి మాట సరిగ్గా రాకపోవటం కనిపెట్టి కాస్త కాఫీ యిచ్చి సంగతేమిటని అడిగాను.

వాడు చెప్పుకొచ్చాడు.

డబ్బంతా స్వామిదగ్గరే వున్నదిగా. ఆయన భద్రంగా యినప్పెట్టెలోనే దాస్తున్నాడట. అన్ని రోజుల్నుంచీ వుంచింది అలాగే వుండేది. కాని యివాళ తెల్లవారుజామున ఏదో అనుమానం తగిలి చూసేసరికి ఖాళీ.

స్వామివారి గుండె గుభేలుమంది. ఈ వార్త విన్న గుండె బ్రద్దలయింది. శాస్త్రితో పాటు పనిచేసిన మిగిలిన పదిమంది గుండెలూ పగిలిపోయాయి.

"అయితే ఎలాగ?" అనడిగాను శాస్త్రిని.

"పోలీసు రిపోర్టు యిచ్చాం" అన్నాడు.

"నీ కేమయినా పిచ్చా? వేరే పోలీసులెందుకు? దొంగ యింకెవరయి వుంటారు? వాడే. వాణ్ణే నిలదీసి అడక్క....."

"ఆగరా" అన్నాడు శాస్త్రి. "అంతంత మాట లనబోక ఆయన్ని."

"వాణ్ణింకా నమ్ముతున్నావా?"

"తప్పకుండా. ఇక ముందుకూడా నమ్ముతాను. నేనే కాదు. రంగయ్యగారుకూడా నమ్మారు. ఏదో ఒక దుష్కృత్యం జరిగిపోయింది. మహా మహుల్ని పట్టుకుని అలా అనెయ్యటమేనా? పోలీసువాళ్ళు స్వామివారి బస కూడా సోదా చెయ్యమని చెప్పేశారు. ఆయనంటే అందరికీ అంత గౌరవం."

"అంత గౌరవం కనకనే అలా చేస్తున్నాడు." అనుకున్నాను మనసులో. శాస్త్రి ఎక్కడ ఏడ్చిపోతాడోనని బయటకి మాత్రం అనలేదు.

"సరే అంత నమ్మకంవుంటే కానిదేముంది? ఎలా జరగాలో అలాగే జరుగుతుంది" అన్నాను. శాస్త్రి కొంచంసేపుండి వెళ్ళిపోయాడు.

"ఎంత గుండెలు దీసిన బంటు. ఆ డబ్బు తీసుకుని ఎక్కడికో పారిపోలేదు? యిక్కడ వుండే ఆ డబ్బు కాజేసి నాటకమంతా ఆడిస్తున్నాడు. కాకేమిటి? యిటువంటి మూర్ఖ ప్రజలుంటే" అనుకున్నాను వాడు వెళ్ళిపోయిన తరువాత.

ఆవిడ వచ్చి గుమ్మందగ్గర నిలబడి అంతా వింది కాబోలు. "అది కాదండి. ప్రతిదానికీ అలా అనుమానిస్తా రెందుకు? దొంగతనం నిజంగా జరగకూడదా?" అంది. శాస్త్రితో మాట్లాడదు గాని శాస్త్రివైపే ఆమె కూడా—

"నీ మొహంలే" అని గదిమేశాను.

తర్వాత శాస్త్రి నాకు అప్పుడప్పుడూ కనిపిస్తూనే వున్నాడు. కనిపించినప్పుడల్లా స్వామే దొంగని నే నంటూనే వున్నాను. కాదని చెవి కోసేస్తానని శాస్త్రి అంటూనే వున్నాడు.

ఇంతలోనే ఒక విచిత్రం జరిగింది.

సదానందస్వామికి ఒక రాత్రి కల వచ్చింది. ఆ కల్లో ఏమని వినిపించిందంటే డబ్బు ఎత్తుకుని పారిపోయిన దొంగలు, తమ పనికి పశ్చాత్తాపపడి ఆ డబ్బు కాస్తా ఒక చిన్న పెట్టెలో పెట్టి, భగవంతుడు వెలిసిన చోటుకు కొద్ది దూరంలోనే పాతిపెట్టి పోయారని. ఇంకేముంది? మరునాడు స్వామి, రంగయ్యగారు మొదలైన ప్రభృతులంతా కలిసి ఆ చోటుకు పోయి త్రవ్వారు. అన్నట్టుగానే వున్నది డబ్బు.

"ఇదంతా నాకు శాస్త్రి చెప్పాడు. చెప్పి. చూశావా? ఆయన్ని అనుమానించావు? భగవంతుని దయవల్ల పోలీసులు సాధించలేని పనిని ఆయ నెలా సాధించి వేశాడో?" అన్నాడు గర్వంగా.

సదానందస్వామిని గురించి నా కున్న నీచాభిప్రాయాన్ని మార్చుకున్నాను. కాని ఆ ధనం అపహరించింది ఎవరో నాకు తెలుసు. స్వామికి ఎందుకు కల వచ్చిందో, అలా ఎందుకు జరిగిందో తెలుసు. కాని శాస్త్రికి యీ విషయమంతా ఎలా నచ్చచెబుతాను. వాడు వినే పరిస్థితిలో వుంటేగా. పై పెచ్చు నన్నే ఎత్తిపొడుస్తున్నాడు.

అదలా అయిపోయింది. ఆ తర్వాత సదానందస్వామి మహాత్యాన్ని గురించి ఆ వూళ్ళోనే కాదు, చుట్టుప్రక్కలకూడా మారు మ్రోగిపోయింది. తిరిగి చందాలు వసూలు చేయటానికి శాస్త్రి ప్రభృతులు తిరిగి సంచారం సాగించారు. ఈ సారి డబ్బులు గలగల రాలిపోయాయి. కారణం శాస్త్రికి తెలీదు. రంగయ్యకూ తెలీదు. దేవుని మహాత్యం అని భావించి వుంటారు.

తర్వాత చూస్తూ చూస్తుండగానే వెలిసిన దేవుని చుట్టూ గుడి లేచింది అట్టహాసంగా. బ్రహ్మాండంగా తయారై వెయ్యి దీపాలతో వెలిగిపోయింది.

* * *

ఆ సాయంత్రం ఆ దారిన పోతున్న నేను నాలో గుంజబడి, నిలబడి నవ్వుకున్నాను. ప్రజల అజ్ఞానాన్ని, మూర్ఖత్వాన్ని గెలిచి కాదు. సదానందస్వామి మహిమను తలుచుకుని.

నా నవ్వులో అపహాస్యం లేదు; ఆక్షేపణా లేదు; పరిహాసం లేదు. మనస్ఫూర్తిగా, సంతోషంగా నవ్వుకున్నాను.

దేవుడు వుండవచ్చు—వుండక పోవచ్చు నాకంటే వారి విషయం తీసి వేయండి. దేవుడు వున్నాడనే వాళ్ళను తీసుకోండి. దేవుడున్నాడనగానే సరికాదు. అందుకు ఆర్థిక సహాయం కావాలి. అంతకన్నా ముఖ్యంగా ప్రజల సానుభూతి కావాలి. సానుభూతికోసం దేవునిలో ఘనమైన మహిమ వుందని అందరూ నమ్మాలి. దేవుణ్ణి నమ్మటానికి అందుకోసం సదానందస్వామివంటి మనుషులు కొద్దిమందయినా ప్రతి దేశంలో, కాదు ప్రపంచంలో వుండాలి—వుండద్దూ? ★